క్లుప్తంగా

శాస్త్రోక్తంగా రుద్రయాగం



యాగం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా రుద్రయాగానికి శ్రీకారం చుట్టారు. 11 రోజుల పాటు రుద్రయాగం కొనసాగనుంది. ఈ సందర్భంగా ఉదయం యాగశాలలో పూజ, రుద్రజపం, హోమం, లఘు పూర్ణాహుతి, నివేదన, హారతి నిర్వహించారు. సాయంత్రం పూజ, జపం, హోమం, రుద్ర త్రిశతి, బిల్వార్చన, నివేదన, విశేష దీపారాధన, హారతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు నిర్ణయంపై హర్షం

తిరుపతి(అలిపిరి): తిరుపతి, తిరుమలవాసులకు ప్రతినెలా మొదటి మంగళవారం శ్రీవారి దర్శనం కల్పించాలని టీటీడీ బోర్డు తీసుకున్న నిర్ణయంపై జనసేన నేతలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఈ మేరకు నాలుగుకాళ్ల మండపం వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. జనసేన నేతలు హరిశంకర్, వరికుంట్ల నారాయణ, మధుబాబు, ఆర్కాట్ కృష్ణప్రసాద్, బాబ్జీ, రాజేష్ ఆచారి, సుభాషిణి, సునీల్ చక్రవర్తి, అశోక్, మునస్వామి, కేఎంకే లోకేష్, హేమంత్, వినోద్ రాయల్ పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరమ్మ జయంతి

తిరుపతి(అలిపిరి): కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ మంగళవారం తిరుపతిలోని స్వగృహంలో ఘనంగా ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు. ఆమె చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపీగౌడ్, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే రాజీవ్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో ఇందిరమ్మ జయంతి నిర్వహించారు.

తిరుపతి సిటీ : ఎస్వీయూలో ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నే మల్లికార్జున, జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, నేతలు బాలు నాయక్, శ్రీకాంత్, దేవేంద్ర పాల్గొన్నారు.

సీజేఎఫ్ఎస్ భూముల పరిశీలన

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురంలో మొత్తం 228 ఎకరాల సీజేఎఫ్ఎస్ (కమ్యూనిటీ జాయింట్ ఫార్మర్స్ సొసైటీ) భూములను ఆర్డీఓ రామ్మోహన్ మంగళవారం పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ సర్వే నంబర్ 102కు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రేణుకా సొసైటీ దళితుల విన్నపం మేరకు అర్హులందరికీ ఇంటి పట్టాలు అందించనున్నట్లు వెల్లడించారు. తహసీల్దార్ వెంకటరమణ, సర్వేయర్లు రమేష్ బాబు, మణి, వీఆర్ఓ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

నవజాత శిశు వారోత్సవాలు

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రి చిన్నపిల్లల విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ నవజాత శిశు వారోత్సవాల అవగాహన ర్యాలీని నిర్వహించారు. నవజాత శిశువుల సంరక్షణ, ఆరోగ్య భద్రత అనే అంశంపై రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ వివరించారు. ప్రొఫెసర్ కిరీటి, డాక్టర్ అంజన్ కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి సిటీ : ఎస్వీయూలో ఈ నెల 22వ తేదీన మహిళల హక్కులు, ఆరోగ్యం-పరిశుభ్రతపై నిర్వహించనున్న సదస్సు పోస్టర్ మంగళవారం వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ఆవిష్కరించారు. సదస్సులో పాల్గొనేందుకు వాల్ట్ సెంటర్, అన్నమయ్య భవన్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కల్చరల్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ అలేఖ్య, ప్రొఫెసర్ ఊకా రమేష్, ప్రయాగ, డాక్టర్ హరికృష్ణ, నాధముని పాల్గొన్నారు.

నేలకూలిన వృక్షం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం సమీపంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో ఉన్న భారీ రావి చెట్టు మంగళవారం సాయంత్రం నేలకూలింది. భారీ కొమ్మ విరిగి రోడ్డుకు అడ్డంగా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సీఐ సుబ్బరామిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని, చెట్టును తొలగింపు పనులు చేపట్టారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఉత్సవాల నిర్వహణపై సమీక్ష

తిరుపతి సిటీ: ఎస్వీయూలో రాష్ట్రస్థాయి సాంస్కృతిక ఉత్సవాల నిర్వహించనున్నట్లు శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, అధికారులతో వీసీ చాంబర్‌లో చర్చలు జరిపారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీలో క్రీడా వసతులు, ఆటస్థలం కోసం నిధులు సాధిస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తిరుపతి రూరల్ : మండలంలోని చిగురువాడ పంచాయతీలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. చంద్రగిరి కొత్త పేటకు చెందిన ఉదయ్(27) నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది.

ఘనంగా 'జాప్' వేడుకలు

తిరుపతి కల్చరల్ : జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జాప్) వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. జాప్ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు.

నయనానందకరం.. నగర వనం

వనంలోని వంతెన మీద నుంచి పార్కు సందర్శనకు వెళుతున్న విద్యార్థులు





నగర వనంలో ఆకట్టుకుంటున్న చెరువు

తిరునగరం శరవేగంగా విస్తరిస్తోంది. కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతోంది. వాహనాల రద్దీ పెరిగిపోతోంది. నిత్యం ఉరుకుల పరుగుల జీవనంలో అలసి సొలసిన తిరుపతి వాసులు సేదతీరేందుకు అటవీశాఖ అధికారులు నగర వనం పేరిట అద్భుతమైన పార్కును ఏర్పాటు చేశారు. ఆహ్లాదక వాతావరణంలో ప్రశాంతంగా కాలం గడిపేందుకు అవకాశం కల్పించారు. వాకర్స్ కోసం ప్రత్యేకంగా ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. పిల్లల ఆటపాటల కోసం అవసరమైన పరికరాలను సమకూర్చారు. కనువిందు చేసే ప్రకృతి సోయగాలను ఆస్వాదించేలా పరిసరాలను తీర్చిదిద్దారు.

- ఆహ్లాదకరంగా ప్రకృతి సోయగం
- ఆరోగ్య రక్షణకు అనుకూలం
- ఆటపాటలకు స్వర్గధామం
- కాలుష్య రహిత వాతావరణం

తిరుపతి మంగళం : ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతికి ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. అలాగే నగర జనాభా సైతం పెరుగుతోంది. యాత్రికులు, స్థానికుల వాహనాల కారణంగా కాలుష్యం అధికమవుతోంది. లక్షల సంఖ్యలో వాహనాల నుంచి వెలువడే పొగ కారణంగా తిరుపతి వాసులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. పెద్దసంఖ్యలో ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. ఈ క్రమంలో జనం సేదతీరేందుకు నగరంలో అక్కడక్కడా కొన్ని పార్కులు మాత్రమే ఉన్నాయి. అయితే ఆయా పార్కుల్లోనూ పచ్చదనం నామమాత్రంగానే ఉంటోంది. ఈ స్థితిలో అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన నగర వనం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటోంది. తిరుపతి ప్రజలకు ఆహ్లాదంతోపాటు ఆరోగ్యరక్షణకు ఉపయోగపడుతోంది. ఉద్యోగ, వ్యాపారాలతో బిజీ బిజీగా గడిపే నగర వాసులు సాయంత్రం వేళ లేదా సెలవు రోజుల్లో హాయిగా కాలక్షేపం చేసేందుకు దోహదపడుతోంది. పచ్చదనంతో నిండి నయనానందకరంగా దర్శనమిస్తోంది. స్వచ్ఛమైన గాలిని అందిస్తూ మనసుకు ఉల్లాసపరుస్తోంది.

శ్రవణానందంగా కిలకిలరావాలు..

పర్యావరణ పరిరక్షణలో భాగంగా అటవీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటైన నగర వనంలో శ్రవణానందంగా పక్షుల కిలకిలరావాలు ఆకర్షిస్తుంటాయి. అలాగే వివిధ వృక్ష జాతులతో వనం కనువిందుగా కళకళలాడుతోంది. అలాగే ఈ పార్క్‌లో ఫిట్‌నెస్ కోరుకునే వారి కోసం వాకింగ్ పాత్‌లు ఉన్నాయి. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ వాకింగ్ చేసిన తర్వాత అలసట తీర్చుకునేందుకు వీలుగా సిమెంట్ బెంచీలు కూడా ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేక చిల్డ్రన్స్ కార్నర్ పేరిట పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. పచ్చదనంతో కూడిన ప్రశాంత వాతావరణంలో సేద తీరాలనుకునే వారికి నగర వనం నెలవుగా మారింది. సందర్శకులకు సాంత్వన చేకూరుస్తోంది.



సందర్శకులకు ఆహ్వానం పలుకుతున్న నగర వనం



చిల్డ్రన్స్ కార్నర్‌లో ఆడుకుంటున్న విద్యార్థులు



సేదతీరుతున్న పిల్లలు.. పెద్దలు

25న కోటి దీపోత్సవం

తిరుపతి కల్చరల్ : కార్తీక మాసం సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సహకారంతో ఈనెల 25వ తేదీన రామచంద్ర పుష్కరిణి వద్ద కార్తీక కోటి దీప మహోత్సవం నిర్వహించనున్నట్లు తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సంస్థ ఆధ్వర్యంలో గత 9 ఏళ్లుగా క్రమం తప్పకుండా లోకకల్యాణార్థం దీప మహోత్సవం చేపడుతున్నామన్నారు. ఉచిత పాస్‌లకు 9848837331, 9440078978 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సొసైటీ అధ్యక్షుడు వైఎస్ బాబు, కార్యదర్శి సీఆర్‌కే శేషగిరిరావు, కోశాధికారి ప్రసాద్‌రావు ,ఉపాధ్యక్షులు బుజ్జిబాబు నాయుడు, సుబ్రమణ్యం, శాంతావాణి, మేరీజాయ్, అనసూయమ్మ, ఎస్.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అన్నమయ్య ఇంటి నిర్మాణానికి వినతి

తిరుపతి కల్చరల్ : తిరుమల మాడ వీధుల విస్తరణలో భాగంగా కూల్చి వేసిన అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలని మంగళంలోని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మికతను పెంపొందించడానికి టీటీడీ అనుబంధ ఆలయాల్లో హరినామ సంకీర్తనలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబర్ 11న గీతా జయంతిని పురస్కరించుకుని శోభాయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. సంక్రాంతి వెంకటయ్య, దేవానంద్, రజని, మహేష్ పాల్గొన్నారు.

జేబీ శ్రీనివాస్‌పై మరో కేసు

తిరుపతి రూరల్ : తిరుపతికి చెందిన టీడీపీ నేత జేబీ శ్రీనివాస్ అక్రమాలు రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయి. తప్పుడు పత్రాలతో సృష్టించి తన భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించడమే కాకుండా మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ చంద్రగిరి మండలం రంగంపేట చెందిన మునిరాజమ్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు... తిరుపతి రూరల్ మండలం తిరుచానూరులో సర్వే నంబర్ 250/2లోని తమ భూమిని జేబీ శ్రీనివాస్ కబ్జా చేసేందుకు యత్నించాడని తెలిపారు. అక్టోబర్ 23వ తేదీన దాడికి పాల్పడినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ చిన్న గోవిందు తెలిపారు.

వైద్య విద్యార్థులకు అవార్డులు



విద్యార్థికి అవార్డు అందిస్తున్న అతిథులు

తిరుపతి తుడా : ఎస్వీ మెడికల్ కళాశాల బయోకెమిస్ట్రీ విభాగంలో విశేష ప్రతిభ కనబరిచిన వైద్య విద్యార్థులకు డాక్టర్ రామారావు మెమోరియల్ అవార్డులు అందజేశారు. మంగళవారం ఎస్వీ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఏవీఎస్ఎస్ రామారావు శత జయంతి సందర్భంగా ఆయన కుమార్తె డాక్టర్ సూర్యలక్ష్మి, కుటుంబ సభ్యులు ప్రతిభ గల విద్యార్థులకు రూ.10వేల నగదు, బంగారు పతకం పంపిణీ చేశారు. ఎస్వీ మెడికల్ కళాశాల డాక్టర్ చంద్రశేఖరన్, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, వైద్యులు పద్మ సుధాకర్, హరిహర శాస్త్రి, బీఎస్ఎన్ మూర్తి , సునీత, ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు సురేష్ బాబు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత

తిరుపతి అర్బన్ : గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని డీఎస్పీ శ్రీలత తెలిపారు. మంగళవారం అన్నమయ్య సర్కిల్ సమీపంలోని లైబ్రరీలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకుని ఆమెకు నివాళులర్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమని వెల్లడించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శివప్రసాద్ ప్రసన్న, రాధ, తహసున్నీసాబేగం, మునిలక్ష్మి, రజనీ, సుజాత, కృష్ణకుమారి పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గులు, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ముందుగా ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమెకు నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ రెడ్డెమ్మ పాల్గొన్నారు.

ముగిసిన నృత్య, నాటక కళోత్సవాలు

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో శ్రీపద్మనాభ నేషనల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా మహతి కళాక్షేత్రంలో చేపట్టిన నృత్య, నాటక కళోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అలరింపజేశాయి. ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కేవీ చలపతి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, రోటరీ క్లబ్ కార్యదర్శి రాజేష్‌కుమార్, మార్కొండేయరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. అతిథులు, కళాకారులను నిర్వాహకుడు కస్పా పద్మనాభన్ ఘనంగా సత్కరించి అభినందించారు. అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కార్యదర్శి కస్పా సామ్రాజ్యం, సిద్ధేంద్రశర్మ, జీఎస్.కోటేశ్వరరావు, కేఎస్.రాజా పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌పై అవగాహన కల్పించండి

తిరుపతి అర్బన్: సోలార్ విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై జిల్లా నెడ్ క్యాప్, ఎస్పీడీసీఎల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ హిత ఇంధన వినియోగం కోసం సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచి, వినియోగంలోనికి తీసుకొచ్చేందుకు ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. సౌర విద్యుత్తు ఉత్పత్తిని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ జుబేదా, డీపీఓ సుశీలదేవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు పాల్గొన్నారు.

కబ్జా నుంచి రక్షణకు వినతి

చంద్రగిరి(తిరుచానూరు): కష్టపడి ప్లాట్లు కొనుగోలు చేసుకుంటే, రాజకీయ నాయకులు, పోలీసు అధికారుల పేర్లు చెప్పి అక్రమంగా కబ్జా చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. 2007లో తిరుపతి రూరల్ మండలం, మామిడికాయల మండీ వెనుక ఉన్న సర్వే నంబర్ 249/4, 249/5లో 120 అంకణాల స్థలాన్ని, తిరుపతి రాయల్ నగర్‌కు చెందిన ఉషారాణి కొనుగోలు చేసినట్టు తెలిపారు. అలాగే సుమారు 14 మంది చుట్టు పక్కల ప్లాట్లను కొనుగోలు చేశారన్నారు. తుంగా బాలకృష్ణ, భాస్కర్ నాయుడు, మురళీధర్ అన్ని ప్లాట్లను కాజీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆయన అన్న కుమారుడు శివ, ఎస్పీ పేరుతో బెదిరిస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు.

ఆక్రమణల తొలగింపు

తిరుపతి తుడా : నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, ఫుట్ పాత్ ఆక్రమణలను కార్పొరేషన్ అధికారులు మంగళవారం తొలగించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు.

హైస్కూల్‌లో ఆధార్ కేంద్రం

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు హైస్కూల్‌లో మంగళవారం ఆధార్ కేంద్రం ప్రారంభించినట్లు డిజిటల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఆర్థిక సాయం

పాకాల : చిగరపల్లెకు చెందిన వి.కన్నమ్మ(60) సోమవారం రాత్రి మృతి చెందింది. మంగళవారం ఆమె అంత్యక్రియలకు ఈడిగ గౌడ సంఘం సభ్యులు రూ.7,500 నగదును వితరణగా అందించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

భాకరాపేట : అవసరానికి తగ్గట్టు ఎరువుల వినియోగానికి భూసార పరీక్షలు చేయించడం తప్పనిసరని వ్యవసాయాధికారులు ధనలక్ష్మి, ఖాదర్‌బాషా తెలిపారు. మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విత్తనశుద్ధి, సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు.

మహిళల కోసమే పింక్ టాయిలెట్లు



మాట్లాడుతన్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: మహిళల కోసమే పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేశామని, వారు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ మౌరతెలిపారు. మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ (వరల్డ్ టాయిలెట్స్ డే) కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన పింక్ టాయిలెట్లు, శ్రీనివాసం వద్ద మరుగుదొడ్లను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ పింక్ టాయిలెట్‌లో మరుగుదొడ్డితోపాటు పిల్లలకు పాలు పట్టేందుకు ప్రత్యేకంగా గది ఏర్పాటు చేశామని వెల్లడించారు. నగరంలో వినియోగంలో లేని మరుగుదొడ్లను తొలగిస్తామని చెప్పారు. అన్ని మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి పాల్గొన్నారు.

'రాయలసీమ చిన్నోడి'కి రంగస్థలి నివాళి



కృష్ణారెడ్డికి నివాళులర్పిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : కవి, గాయకుడు, కళాకారుడు, రాయలసీమ చిన్నోడిగా పేరుపొందిన పులికంటి కృష్ణారెడ్డి జయంతిని పురస్కరించుకుని మంగళవారం రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు ఏ వేదిక ఎక్కినా రాయలసీమ చిన్నోణ్ణి రాళ్ల మద్దె బతికేవాణ్ణి.. రాగాలే ఎరుగకపోయినా అనురాగానికి అందేవాణ్ణి.. అంటూ పాడి అందరి మన్ననలను అందుకున్న ప్రతిభామూర్తి కృష్ణారెడ్డి అని కొనియాడారు. ఈ క్రమంలోనే కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు నవజీవన వృద్ధాశ్రమంలో 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కళాకారులు కేఎస్ రాజా, పొన్నాల జేజి రెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, కస్పా పద్మనాభన్, మురళీ, వాసు, రాధాకృష్ణారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తిరుపతి కల్చరల్ : ఎస్పీ జేఎస్ఎంసీ హైస్కూల్లో 1973–74 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో కలుసుకున్నారు. ఐదు దశాబ్దాల నాటి ముచ్చట్లను చెప్పుకుని మురిసిపోయారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పరస్పరం జ్ఞాపికలు బహూకరించుకున్నారు. పూర్వ విద్యార్థులు సతీష్‌కుమార్, దేవానంద్, గోపాలకృష్ణ, రాజగోపాల్, రాంబాబు, బాలసుబ్రమణ్యం, దేష్‌కుమారి, కోటేశ్వరి, రేణుక, బృంద పాల్గొన్నారు.

తిరుక్షేత్రాల రక్షణ సమితి పూజలు

తిరుపతి(అలిపిరి): తిరుపతి వాసులకు ప్రతినెలా మొదటి మంగళవారం శ్రీవారి దర్శన భాగ్యం కల్పించినందుకు మంగళవారం అలిపిరి పాదాల మండపం వద్ద తిరుక్షేత్రాల రక్షణ సమితి వారు టెంకాయలు కొట్టి పూజలు చేపట్టారు. అనంతరం టీటీడీ చైర్మన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తుమ్మ ఓంకార్, చీనేపల్లి కిరణ్‌కుమార్, రమాదేవి, నీలకంఠ, మధు, రమేష్, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఆదిదంపతులకు పూలంగిసేవ



సుగంధ సుమాల నడుమ స్వామి, అమ్మవారు

చంద్రగిరి : తొండవాడ స్వర్ణముఖీ నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యీశ్వరస్వామివారి ఆలయంలో వారం రోజులుగా రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం స్వామివారికి విశేష పూజలను నిర్వహించారు. అనంతరం ఆది దంపతులకు కనులపండువగా పూలంగి సేవ జరిపించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి పాల్గొన్నారు. అలాగే ఆర్ఎఫ్ రోడ్డులో వెలసిన శ్యామలాంబ సమేత మల్లేశ్వర స్వామి(పుట్టాలమ్మ) ఆలయంలో స్వామివారిని డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



కార్తీక మాసాన్ని పురస్కరించుకుని టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన సేవను మంగళవారం వైభవంగా నిర్వహించారు. రుద్రహోమం చేపట్టారు. స్వామి,అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి,అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

– సాక్షి, తిరుపతి ఫొటో గ్రాఫర్

ఫార్మాసిస్ట్‌ల సేవలు కీలకం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రామచంద్రాపురం: వైద్యరంగంలో ఫార్మాసిస్ట్‌ల సేవలు కీలకమని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ నిరంజన్‌బాబు తెలిపారు. మంగళవారం 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు ఫార్మా అవేర్‌నెస్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస ఆయుర్వేదిక్ ఫార్మసీ విశ్రాంత ప్రొడక్షన్ సూపర్‌వైజర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మూలకణాల ద్వారా అనేక వ్యాధులకు ఔషధాలను కనిపెట్టి, మెరుగైన వైద్యం అందించవచ్చని వెల్లడించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రసన్నరాజు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల మద్యం పట్టివేత

చంద్రగిరి : నియోజకవర్గంలో వేర్వేరు చోట్ల ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. ఎర్రావారిపాళెం మండలం వేములవాడ నుంచి చెంగాడవాండ్లపల్లె సమీపంలోని రైస్‌మిల్ వద్ద మద్యం విక్రయిస్తున్న దర్బాఖాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అలాగే యలమంద సాయిబులపల్లె సమీపంలో సారా తయారు చేస్తున్న ఆరీఫున్నీసాఅనే మహిళను ఎక్సైజ్ సీఐ పవన్ అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.